

## సాగు.. సగానికి తక్కువే

పప్పు దినుసుల సాగు గణనీయంగా తగ్గిపోతోంది. ప్రభుత్వం నుంచి మద్దతు ధర లభించినా సాగు విస్తీర్ణం పెరగడం లేదు.

వివరాలు 8లో ▸



## పర్యాటక కొండ..

సంజీవరాయుడి గుట్ట పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ప్రకృతి అందాలకు నిలయంగా నిలుస్తోంది.

వివరాలు 8లో ▸

## నేడు ఏబీసీ కేంద్రం పునఃప్రారంభం

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో కొన్ని నెలలుగా మూసివేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ)ను శనివారం అధికారులు పునఃప్రారంభం చేయనున్నారు. ఉదయం జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ప్రేరణలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

## న్యూస్‌రీల్

### పాత పెన్షన్ విధానం అమలు చేయండి

సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్



జీఓ నంబర్ 28 ప్రతులను దహనం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

గజ్వేల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తెస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటను నిలబెట్టుకోవాలని సీపీఎస్ఈయూ (స్టేట్ కాంట్రీబ్యూటరీ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్ డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లోని ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వద్ద 2014 ఆగస్టు 23న అమల్లోకి వచ్చిన నూతన పెన్షన్ స్కీమ్ జీఓ నంబర్ 28 ప్రతులను దహనం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి జీఓపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన జీఓ నంబర్ 28ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమల్లోకి తేవాలన్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు వివిధ రూపాల్లో తమ నిరసనను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ఈయూ జిల్లా ఉపాధ్యక్షులు వై. రాజు, గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు షేక్ బిలాల్, కమలాకర్, లవకుమార్, మల్లేశం, అష్రాఫ్, ఉపేంద్ర, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### కుల బహిష్కరణ చేసిన వారిపై కేసు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం బొప్పాపూర్‌లో కులబహిష్కరణకు పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలో సాయిలు అనే వ్యక్తి మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశామంటూ అంత్యక్రియలకు రాలేదు. శుక్రవారం మృతుని భార్య పోశవ్వ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గవ్వల చంద్రయ్య, కోనాపురం శ్రీనివాస్, మారి చంద్రయ్య, గవ్వల పెంటయ్య, ఎనగుర్తి పద్మయ్య, దుంపలపల్లి స్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరీశ్ తెలిపారు.

### పత్తిలో సస్యరక్షణ తప్పనిసరి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి రాధిక

చేర్యాల(సిద్దిపేట): పత్తిలో వచ్చే గులాబి రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి రాధిక సూచించారు. శుక్రవారం మండలంలోని కడవేర్గు గ్రామంలో ఎల్‌డీసీ, దేశపాండే ఫౌండేషన్స్ ప్రతినిధులతో కలిసి పత్తి పంటను పరిశీలించారు. అనంతరం 175 మంది రైతులకు లింగాకర్షక బుట్టలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి విత్తిన 45 రోజుల నుంచి గులాబి రంగు పురుగు పత్తిపంటపై ఆశిస్తుందని దాని ఉనికిని తెలసుకునేందు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. నివారణకు ప్రోఫినోపాస్ 2.మి.లీ. లేదా క్లోరోపైరిపాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్ రావు, కంపెని ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న తపస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన మెదక్‌లోని తపస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది బదిలీల కోసం ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. బదిలీలలో గరిష్టంగా 8 సంవత్సరాలు ఒకే చోట పనిచేస్తున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలన్నారు. అదేవిధంగా జీరో సర్వీస్ ఉన్న వారికి కూడా బదిలీలలో అవకాశం ఇవ్వాలన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ మినిమం పే స్కేల్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.

# రుచిలేని కూరలు.. శుచిలేని వంటలు

**'మధ్యాహ్న భోజనం' అస్తవ్యస్తం**

- అమలు కానీ మెనూ..
- పెండింగ్‌లో బిల్లులు
- కొన్ని పాఠశాలలో కానరాని గుడ్డు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- 'సాక్షి' విజిట్‌లో వెలుగుచూసిన వాస్తవాలు

సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజనం అస్తవ్యస్తంగా మారింది. రుచిలేని కూరలు.. శుచిలేని వంటలతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. 'మధ్యాహ్న భోజనం' అమలును విద్యాశాఖ పట్టించుకోకపోవడం వల్లే సమస్యలు ఏర్పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు వంట బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో నిర్వాహకులు వంటలు చేసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. శుక్రవారం పలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో 'సాక్షి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. నీళ్ల చారు.. రుచిలేని వంటలు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. దీంతో పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలన్న సర్కారు లక్ష్యం నెరవేరడం లేదు. – సాక్షి, సిద్దిపేట



తడ్కపల్లిలో ప్రాథమిక పాఠశాలలో గుడ్డుకు బదులు ఇచ్చిన అరటి పండు

విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్న సాకుతో మెనూ అమలు చేయడం లేదు. పలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలుపై 'సాక్షి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 161 మంది విద్యార్థులుండగా 120 మంది హాజరయ్యారు. విద్యాశాఖ నిర్ణయించిన మెనూ ప్రకారం సాంబారు, వెజిటబుల్ మిక్స్‌డ్ కర్రీ, ఎగ్‌ను అందించాలి. కానీ ఆ పాఠశాలలో బెండకాయ చారు, గుడ్డు, అన్నం అందించారు. మెనూ పాటించడం లేదా అని పాఠశాల టీచర్లను అడగ్గా వంట కార్మికులకు కొన్ని నెలలుగా బిల్లులు రావడం లేదన్నారు. దీంతో వంటలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిపారు. వీరితోనే ఎలాగో అలా నెట్టుకువస్తున్నామని చెప్పారు.

**బిల్లుల చెల్లింపుల్లో జాప్యం**

జిల్లా వ్యాప్తంగా 921 ప్రభుత్వ పాఠశాలలో 73,246 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తోంది. వీరి కోసం 1,982 మంది వంట కార్మికులు పనిచేస్తున్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 8.17 ఇస్తుండగా, విద్యార్థుల హాజరుకు అనుగుణంగా డబ్బులను జూన్ వరకు చెల్లించారు. 9, 10వ తరగతి ఒక్కో విద్యార్థికి రూ.10.67 ఇస్తుండగా భోజనం బిల్లులు జనవరి వరకు, ఎగ్‌ల బిల్లులు మార్చి నెల వరకే చెల్లించారు. బిల్లులు చెల్లింపులు జాప్యం చేస్తుండటంతో మధ్యాహ్న భోజన కార్మికులు పోషక విలువలు ఉండే భోజనం అందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**అరకొరగా వంటలు..**

సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 168 మందికి 122 మంది హాజరయ్యారు. వంకాయ టమాటా, అన్నం, అరటి పండును అందించారు. ఉడకబెట్టిన గుడ్డుకు బదులు అరటి పండును అందించారు. ఉపాధ్యాయులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పర్యవేక్షణ కరువైంది.

- కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 150 మంది విద్యార్థులున్నారు. పెసరపప్పు టమాటా, సాంబారు, గుడ్డును అందించారు.
- మద్దూరు మండలం వల్లంపట్లలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలలో 1 నుంచి 7వ తరగతి వరకు 58 మంది విద్యార్థులున్నారు. బిల్లులు సరిగా రావడం లేదని ఈ నెల 12 నుంచి మధ్యాహ్న భోజనం బంద్ చేశారు. విద్యార్థులు ఇబ్బంది పడవద్దన్న ఉద్దేశంతో స్థానిక యువతనే వంట చేసి వడ్డిస్తుండటం గమనార్హం.
- దూళ్మిట్ట మండలం కూటిగల్ ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. పప్పు, గుడ్డు, అన్నం అందించారు.
- మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 130 మంది, ప్రాథమిక పాఠశాలలో 102 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పప్పు, పచ్చి పులుసు, అన్నం పెట్టారు. గుడ్డు లేకుండానే మధ్యాహ్న భోజనం అందించారు.
- కొమురవెల్లి మండలం ప్రాథమిక పాఠశాలలో 25 మంది విద్యార్థులున్నారు.నీళ్ల సాంబర్, గుడ్డు, అన్నం అందించారు.

**అప్పు తెచ్చి వండి పెడుతున్నాం**

మా ఊరి స్కూల్‌లో 15 ఏళ్లుగా వంటలు చేస్తున్నా. ఈఏడాది బడులు ప్రారంభమైనప్పటి నుంచి బిల్లులు రాలేదు. అప్పు తెచ్చి కూరగాయలు, పప్పు, గుడ్లకు పెడుతున్నాం. మూడు నెలల తర్వాత బిల్లులు ఇస్తే అవి మిత్తికే సరిపోతున్నాయి. మాకేమి మిగలడం లేదు. కూరగాయలు, పప్పుల ధరలు బాగా పెరిగిపోయాయి. అధికారులు స్పందించి బిల్లులు త్వరగా ఇప్పించాలి.

– కనకమ్మ, ఎన్సాన్‌పల్లి



**మెనూ ప్రకారం అందించాలి**



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలి. రోజు ఒక మండలం విజిట్ చేసినప్పుడు మధ్యాహ్న భోజనం అమలు తీరును సైతం పరిశీలిస్తున్నా. మెనూ పాటించని వారిపై చర్యలు తప్పవు.

–శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ

# భూ సమస్యల పరిష్కారానికే ఆర్‌ఓఆర్

- ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- కలెక్టరేట్‌లో అభిప్రాయసేకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన 'ఆర్‌ఓఆర్' తీసుకువస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఈ ముసాయిదా బిల్లుపై ప్రజలు తెలిపిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాలులో ఆర్‌ఓఆర్ ముసాయిదా బిల్లుపై అభిప్రాయ వేదిక కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాక తహసీల్దార్ వెంకటరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ఆర్‌ఓఆర్ -2024 ముసాయిదా బిల్లులోని 20 అంశాలను వివరించారు. అనంతరం అనుకూల, ప్రతికూల అంశాలపై న్యాయవాదులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ట్రెసా ప్రతినిధులు తదితరులు మాట్లాడారు. కొత్త చట్టంలో భూ రికార్డులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్ లైన్‌లో కూడా ఉండాలని సూచించారు. లీగల్ విల్ డీడ్ చేసినప్పుడు దానినే ప్రామాణికంగా చేసుకొని రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ప్రైవేటు భూములతో పాటు ప్రభుత్వ, దేవాదాయ భూములకు కూడా కాస్తుదారు ఉండాలని సలహాలు అందించారు. భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాలు సబ్ రిజిస్ట్రార్ల ద్వారా మాత్రమే జరిగేలా చూడాలన్నారు. ధరణిలో జరిగిన పొరపాట్లను ఆర్డీఓ ద్వారా పరిశీలించి సరి చేసే అధికారం కల్పించాలన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కార వేదిక జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలని, జవాబుదారితనంతో కూడిన వీఆర్‌ఓ వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టాలని, క్షేత్ర స్థాయిలో రెవెన్యూ రికార్డులపై ఆజమాయిషీ తహసీల్దార్ వద్దనే ఉండాలన్నారు. మున్సిపల్ ప్రాంతాలలో నాలాలు చెరువులు కబ్జాకు గురి కాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ మ్యాపులు రూపొందించాలని వారు సూచించారు. రెవెన్యూ కోర్టులకు బదులుగా రిటైర్డ్ జడ్జిలు, రిటైర్డ్ కలెక్టర్లు, రిటైర్డ్ అదనపు కలెక్టర్లతో ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలన్నారు.

అనంతరం కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ నూతన ఆర్‌ఓఆర్ 2024 ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు తీసుకోవడం కోసం అభిప్రాయ వేదిక నిర్వహించినట్లు తెలిపారు. అందరి సలహాలు, సూచనలను అన్నింటిని రికార్డు చేశామన్నారు. ఈ వివరాలను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. తద్వారా భవిష్యత్‌లో రెవెన్యూ సంబంధించిన సమస్యలకు సత్వర పరిష్కారం లభించేందుకు వీలుంటుంది. కార్యక్రమంలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, కలెక్టరేట్ ఏవో రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బార్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు

## శ్రావణ శుక్రవారం పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమ్మవారి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. సంతోషిమాత వ్రతకథ ఉద్యాపన పూజలు చేపట్టారు. అనంతర భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. అమ్మవార్ల ఆలయాల పరిసరాలన్నీ సందడిగా మారాయి.





పూజల్లో పాల్గొన్న మహిళలు, (ఇన్‌సెట్) విశేష అలంకరణలో సంతోషిమాత

# రుణమాఫీ పేరిట డ్రామాలు

**బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి వేణుగోపాల్**



మాట్లాడుతున్న కొత్తపల్లి వేణుగోపాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రుణమాఫీ పేరిట బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రోజుకొక డ్రామాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యవర్గం నిర్వహించిన సమావేశంలో వేణుగోపాల్ పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ చేశామని కాంగ్రెస్ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా రూ.42వేల కోట్లు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, చివరకు కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే నిధులు కేటాయించారన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు. సిద్దిపేటలో పక్షం రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే కాంగ్రెస్, బీ ఆర్ ఎస్ ఒక్కటై డ్రామా నడిపినట్లు ఉందని విమర్శించారు. ఫ్లెక్సీలలు, బ్యానర్ల పేరుతో సిద్దిపేట లో కాంగ్రెస్ , బీఆర్ఎస్‌లు ఆందోళనలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి తమ డ్రామాలను ఆపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు వెంకటేశం, గుండ్ల జనార్దన్, ఇర్రి మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహం ఆకస్మిక తనిఖీ



విద్యార్థినికి దుస్తులు అందజేస్తున్న జగత్ కుమార్‌రెడ్డి

ప్రశాంత్ నగర్( సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని వసతి గృహాన్ని బీసీ సంక్షేమ శాఖ అధికారి జగత్ కుమార్ రెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో వసతులపై ఆరా తీశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? లేదానని అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయిని చేరుకోవాలన్నారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు.

## క్రమబద్ధీకరణకు హెల్ప్ డెస్క్‌లు

సిద్దిపేట రూరల్: జిల్లాలో ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు సంబంధించి సందేహాలు అనుమానాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఆదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనధికారలే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 10,3694 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వాటికి సంబంధించి 29 టీంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్, నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేకంగా టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 57,911, గ్రామ పంచాయతీల్లో 21,401, సుడా పరిధిలో 21,340 ,హెచ్ఎండీఏ పరిధిలో 3042 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కలెక్టరేట్, అన్ని మున్సిపాలిటీల్లో, తహసీల్దార్ కార్యాలయాల్లో, సుడా కార్యాలయంలో, నీటిపారుదల శాఖ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## శాంతి భద్రతలపై అలసత్వం తగదు

**సీపీ అనురాధ**



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: శాంతి భద్రతల విషయంలో అలసత్వం తగదని సీపీ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. క్విక్ రియాక్షన్ టీమ్ సిబ్బందితో వారు నిర్వర్తించాల్సిన విధులపై సీపీ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడ ఏదైనా సంఘటన జరిగితే వెంటనే క్యూఆర్టీ టీమ్ చేరుకోవాలని సూచించారు. అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఆర్ అదనపు డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శనిగరం.. బహు సుందరం

కొహెడ మండలం శనిగరం రిజర్వాయర్ అందాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. పురాతన కాలంలో కట్టిన తూం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. పంటపొలాలకు నీరు అందించేందుకు అప్పటి పాలకులు బండరాళ్లతో నిర్మించారు. పచ్చని కొండల మధ్య రిజర్వాయర్ ఇలా కనువిందు చేస్తోంది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



శనిగరం రిజర్వాయర్

## సెప్టెంబర్ 10 వరకు 'ఓపెన్' అడ్మిషన్లు

మెదక్ కలెక్టరేట్: ఆగిపోయిన చదువు కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ఒక మంచి అవకాశమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 10 వరకు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ విజయ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి, ఏఎంఓ సుదర్శనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నంబర్ వన్ స్థానంలో నిలువడం అభినందనీయం



మొక్క నాటుతున్న వినోద్‌కుమార్

**గజ్వేల్‌రూరల్:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ బస్ డిపోను రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో నిలుపడం హర్షణీయమని హైదరాబాద్, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం బస్సు డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రికార్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్సు డిపో సిబ్బంది రాఖీ పండుగ అంకితభావంతో పని చేసి రాష్ట్రంలో అత్యుత్తమమైన ఆదాయం తెచ్చినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కండక్టర్, డ్రైవర్ శ్రమను కొనియాడారు. అలాగే ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడిపేలా తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పావన్, బాబునాయక్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

### యోగాలో విద్యార్థుల ప్రతిభ

– ముగిసిన జిల్లా స్థాయి పోటీలు



యోగా చేస్తున్న విద్యార్థులు

**చేగుంట(తూప్రాన్):** మండల కేంద్రమైన చేగుంటలో శుక్రవారం జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించగా అనిల్‌రెడ్డి పోటీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో ఆరు విభాలుగా విభజించి పోటీలను నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి 183 మంది క్రీడాకారులు పాల్గొనగా 72 మందిని విజేతలుగా ఎంపిక చేసినట్లు కోచ్ కరణం గణేశ్ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శారద, మంజులత, నరేశ్, సత్యనారాయణ, శ్యాం, రెఫరీలుగా మల్కీలశ్వరీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయండి

– కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న గ్రామస్తులు

**మెదక్ కలెక్టరేట్:** తమ కోమటిపల్లి, కోమటిపల్లి తండా, వడ్డెర కాలనీని కలిపి పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోమటిపల్లి, కోమటిపల్లితండా, వడ్డెర కాలనీలు రామాయంపేట మున్సిపాలిటీలో ఉండటంతో ఉపాధి పనులు కరువయ్యాయని తెలిపారు. ఉపాధి పనులు లేక వలస కూలీలుగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. మున్సిపాలిటీ కారణంగా అధిక పన్నులు కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ నుంచి సరైన నిధులు రాక అభివృద్ధికి నోచుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**మిరుదొడ్డి(దుబ్బాక):** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని భూంపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై హరీశ్ కథనం మేరకు.. స్థానిక భూంపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుంగా ఓ బొలేరో వాహనంలో 60 సంచుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా గుర్తించాం. దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన పర్వతం యాదగిరిపై కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని ఎమ్మెల్సీ పాయింట్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



# సాగు.. సగానికి తక్కువే

**తగ్గిన పప్పుదినుసుల విస్తీర్ణం**
- ప్రతీయేటా పడిపోతున్న వైనం
- జిల్లాలో 'పల్స్'పై తీవ్ర ప్రభావం
- మద్దతు ధర లభించినా ఆసక్తి చూపని రైతులు



ఓ రైతు సాగు చేసిన కంది

మనిషికి అవసరమైన అత్యంత విలువైన పోషకాలను అందించే పప్పు దినుసుల సాగు జిల్లాలో గణనీయంగా తగ్గిపోతుంది. మార్కెట్‌లో పప్పులకు మంచి ధర ఉన్నా, ప్రభుత్వం నుంచి మద్దతు ధర లభించినా సాగు విస్తీర్ణం మాత్రం పెరగడం లేదు. ప్రభుత్వం పప్పు దినుసుల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని అధికారులను తరచూ ఆదేశిస్తుంది. అధికారులు కూడా సభలు, సమావేశాల్లో సూచిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలో వర్షాభావం కారణంగా పప్పుదినుసుల సాగుపై ప్రభావం పడిందని అధికారులు చెబుతున్నారు.

– నారాయణఖేడ్

జిల్లా వ్యాప్తంగా పప్పుదినుసుల సాగు విస్తీర్ణం భారీగా తగ్గుతుంది. ముఖ్యంగా నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లో పప్పుదినుసుల సాగు అధికంగా ఉంటుంది. స్వల్పకాలిక రకంగా ఉన్న పెసర పంట విస్తీర్ణం భారీగా తగ్గింది. పెసరను జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 41,832 ఎకరాల్లో రైతులు సాగు చేయాల్సి ఉండగా కేవలం 11,813 ఎకరాల్లోనే సాగు చేశారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గింది. మార్కెట్లో పెసర పంటకు మంచి ధర ఉంది. పెసర పంట స్వల్పకాలిక రకం కాగా మూడు నెలల్లోపే పంట రైతు చేతికి వస్తుంది. ఈ పంటలో అంతర పంటగా ఇతర పంటను సాగు చేసి రైతులు ఒకే యేడులో రెండు రకాల పంటలను తీసుకొనే అవకాశం ఉంది. కానీ ఈ పంట విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. మినుము 21,877 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉంగా 7,473 ఎకరాల్లోనే సాగు చేశారు. ఈ పంట కూడా మూడో వంతు మాత్రమే సాగు చేశారు. కంది పంట 70,831ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంట సాధారణ స్థాయిలోనే సాగు అయ్యింది. అధిక మొత్తంలో సాగు చేయాల్సిన అవసరం ఉంది.



నారాయణఖేడ్‌లో సాగు చేసిన పెసర పంట

**పెరుగుతున్న పత్తి**

పత్తి పంట జిల్లాలో 2.85 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఈ పంటను 3,32,698 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పత్తి విస్తీర్ణం ప్రతీసారి పెరుగుతూనే వస్తుంది. రెండేళ్లుగా మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. కానీ రైతులు ధరలు అధికంగా ఉంటాయన్న ఆశతో పత్తి పంట సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. కానీ మార్కెట్‌లో పప్పులకు మంచి ధర పలుకుతుంది. ప్రభుత్వ మద్దతు ధరకు మించి పప్పుల ధరలు మార్కెట్‌లో ఉంటున్నాయి.

**వర్షాభావంతో ప్రభావం**

జిల్లాలో ఈయేడు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ మండలాల్లో పప్పుదినుసుల సాగు అధికంగా ఉండగా ఈ నియోజకవర్గాల్లోని 7 మండలాల్లో రెండు నెలల్లో లోటు వర్షపాతం నమోదు కావడం పంట సాగుపై తీవ్ర ప్రభావం పడింది. జూన్ నెలలో 120 మి.మీ వర్షపాతం జిల్లాలో కురవాల్సి ఉండగా 139 మి.మీ కురిసింది. జూలైలో 194కు గాను 188 మిల్లీ మీటర్లు కురిసింది. ఆగస్టు నెలలో కూడా ఇప్పటివరకు లోటు వర్షపాతమే నమోదు అయ్యింది. జూన్ నెలలో వర్షాకాలం ప్రారంభంలో భారీ వర్షాలు కురిసి సాధారణం కంటే రెట్టింపు వర్షపాతం నమోదు కావాలి. కానీ అందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. తక్కువ వర్షపాతం వల్ల పంటల సాగుపై ప్రభావం పడింది.

**2 ఎకరాల్లోనే సాగు**



పెసర ఒక ఎకరం, కంది ఎకరంలో సాగు చేశాను. ప్రతీసారి నాలుగు ఎకరాల్లో పెసర మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేసేవాడిని. ఈసారి వర్షాభావం కారణంగా రెండు ఎకరాల్లోనే ఈ పంట సాగు చేపట్టాను. పత్తి పంట నాలుగు ఎకరాల్లో వేశా. వర్షాలు సరిగా లేవు.

– బిరాదర్ ప్రవీణ్, రైతు, జగన్నాథ్ పూర్

**దెబ్బతిన్న పెసర..**



సరియైన వర్షాలు లేని కారణంగా పెసర పంట దెబ్బతింది. రెండు ఎకరాల్లో పెసర పంట, మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. పెసరకు భారీగా నష్టం వాటిల్లింది. దిగుబడి గణనీయంగా తగ్గింది. ఈయేడు సరైన వర్షాలు కురియలేదు.

– పటేల్ రమేశ్, రైతు, జగన్నాథ్ పూర్

# అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి

**రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి**



నగేశ్ మృతదేహం

**సిద్దిపేటఅర్బన్:** బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం అంబేడ్కర్ నగర్‌కు చెందిన బండి నగేశ్ (24) బంధువుల పెళ్లి బరాత్ నిమిత్తం తొగుట మండలం గుడికందుల గ్రామానికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సిద్దిపేటకు తిరిగి వస్తున్నాడు. ఎన్సాన్‌పల్లి శివారు సర్వాయి పాపన్న చౌరస్తా వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి కనకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

**అత్తగారింటికి వెళ్తూ..**

**గజ్వేల్‌రూరల్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొల్గురూ గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ సైదా కథనం మేరకు.. సిద్దిపేట జిల్లా నిజాంపేట మండలం తిప్పనగండ్ల గ్రామానికి చెందిన షేరుపల్లి స్వామి(40) కొన్నేళ్లుగా ప్రజ్ఞాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం అత్తగారి గ్రామమైన మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌కు వెళ్తుండగా కొల్గురూ గ్రామ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో రాత్రంతా అక్కడే పడి ఉన్నాడు. శుక్రవారం కొల్గురూ గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్తూ చూసి గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### ముందుకు తీస్తూ కారు బీభత్సం

**దంపతులను ఢీకొట్టడంతో గాయాలు**
**అనంతరం డివైడర్ పైకెక్కిన వాహనం**



డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

**సిద్దిపేటకమాన్:** కారు డివైడర్ పైకి దూసుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రం సిద్దిపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట ఓ కారు డ్రైవర్ వాహనాన్ని ముందుకు తీస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పి అటుగా వెళ్తున్న మరో బుల్లెట్ బైక్ పైకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా కారు ముందుకు దూసుకెళ్లడంతో ద్విచక్ర వాహనం కారు కింద పూర్తిగా ఇరుక్కుపోయింది. అనంతరం రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయట పడడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డివైడర్ పై నిలిచిపోయిన కారును పక్కకు తొలగించారు.

### ఆరు నెలల తర్వాత తల్లిదండ్రుల చెంతకు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ

**తూప్రాన్:** మతి స్థిమితం లేక దారి తప్పిన మానసిక దివ్యాంగుడు ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేరాడు. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన మెరుగు గాడ్సన్ జాషువా మొదటి కుమారుడు బ్లెస్సెన్ రాజు (20) మతిస్థిమితం లేని మానసిక దివ్యాంగుడు. 2024 జనవరిలో హైదరాబాద్‌లోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పెద్దనాన్న సెల్వ రాజు వద్దకు వచ్చాడు. అదే నెల చివరి వారంలో తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 2వ తేదీన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో పోలీసులకు దొరికాడు. వారు శివ్వంపేట మండలంలోని బేతాని ఆశ్రమంలో అప్పగించగా అక్కడే ఉంటున్నాడు. జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్, మెదక్ పోలీసులు 'దర్పనేప'లో వివరాలు నమోదు చేశామన్నారు. అందులో భాగంగా తల్లిదండ్రులను గుర్తించి వారికి సమాచారం అందించామని ఎస్ఐ తెలిపారు. ఆరు నెలల తర్వాత కుమారుడు దొరకడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

# డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం

- నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్ ద్వారా మొదటి కేసు
- ములుగు పీఎస్ పరిధిలో ఇద్దరు అనుమానితులకు పరీక్షలు
- గంజాయి తీసుకున్నట్లు రిపోర్టులో నిర్ధారణ



అనుమానితులను పరీక్షిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్

**సిద్దిపేటకమాన్/ములుగు:** జిల్లాకు నూతనంగా వచ్చిన నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్ ద్వారా పోలీసు సిబ్బంది ఇద్దరు అనుమానిత వ్యక్తులను పరీక్షించగా అందులో ఓ వ్యక్తి గంజాయి తీసుకున్నట్లు రిపోర్టులో తేలింది. మిషన్ ద్వారా సిద్దిపేట జిల్లాలో మొదటి కేసు నమోదైనట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడమే మన ప్రధాన లక్ష్యమని, మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని అన్నారు. ములుగు మండల కేంద్రం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని పౌల్ట్రీ ఫామ్ వద్ద గురువారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు బహిరంగంగా మద్యం తాగుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి మద్యం దొరకలేదన్నారు. ఘటనా స్థలంలో ఉన్న ములుగుకు చెందిన గంగబోయి స్వామి, యూ.సురేశ్ ప్రవర్తనలో అనుమానం రావడంతో పోలీసులు నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్‌తో టెస్ట్ చేయగా గంజాయి సేవించినట్లు రిపోర్టు వచ్చింది. పోలీసులు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్లను జిల్లా వ్యాప్తంగా 100 కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేటప్పుడు తప్పకుండా వీటిని ఉపయోగించాలన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. యువత గంజాయి, దురలవాట్లకు అలవాటు పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సీపీ హెచ్చరించారు.



నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్

**గజ్వేల్‌రూరల్:** నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్‌తో శుక్రవారం రాత్రి గజ్వేల్ పట్టణంలో తనిఖీలు చేపట్టినట్లు సీఐ సైదా తెలిపారు. అనుమానం ఉన్న వ్యక్తులను నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్ ద్వార పరీక్షిస్తామన్నారు.

# అధిక ఆదాయాన్నిచ్చే పంటలు వేయాలి



రైతులకు నీమ్ ఆయిల్, జీవన ఎరువులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

- కేవీకే హెడ్, శాస్త్రవేత్త శంబాజి దత్తా త్రేయనల్కర్
- రైతులకు నీమ్ ఆయిల్, జీవన ఎరువుల పంపిణీ

**కౌడిపల్లి(నర్సాపూర్):** సంప్రదాయ పంటలకు భిన్నంగా అధిక ఆదాయాన్నిచ్చే పంటలను రైతులు సాగు చేయాలని కేవీకే హెడ్, శాస్త్రవేత్త శంబాజి దత్తాత్రేయ నల్కర్ సూచించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ డి. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ రైతులకు పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి చేయాలన్నారు. వరికి బదులుగా పండ్ల తోటల్లో బొప్పాయి, మిర్చి, ఉల్లి, ఆకుకూరల పంటలు సాగు చేయడంతో అధిక ఆదాయం వస్తుందన్నారు. బొప్పాయి సాగులో మంచి లాభాలు ఉంటాయని అన్నారు. కూరగాయలతో ప్రతి రోజూ ఆదాయం వస్తుందన్నారు. రైతులు సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేయాలన్నారు. ప్రతి రోజూ పంటను పరిశీలించాలని చీడపీడలు ఆశిస్తే నివారణకు నీమ్ ఆయిల్, కషాయాలు స్ప్రే చేయాలన్నారు. ఈ సందర్భంగా 41 మంది ఎస్సీ రైతులకు నీమ్ ఆయిల్, జీవన ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త, షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

**బీవీఆర్ ఐటీ కంప్యూటర్ విజ్ఞాన విభాగాధిపతి మధుబాబు**



మద్దూర్ పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న కళాశాల సిబ్బంది

**నర్సాపూర్ రూరల్:** విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని బీవీఆర్ ఐటీ విభాగాధిపతి సీహెచ్.మధుబాబు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాల కంప్యూటర్ విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో మండలంలోని కాగజ్ మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్య కోసం కంప్యూటర్లను అందజేశారు. కార్యక్రమంలో మధుబాబు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు బీవీఆర్ ఐటీ యజమాన్యం కృషి చేస్తుందన్నారు. కృత్రిమ మేధ, యంత్ర విద్య మొదలైన అంశాల్లో సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్యాకేజీతో క్యాంపస్ ప్లేస్ మెంట్ అవకాశాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డా.ఆర్ సూర్యప్రకాశ్ రావు, యూసుఫ్, షరీఫ్, మహేందర్ రెడ్డి, సత్యనారాయణాచారి, కవిత, అప్పల నాయుడు, సురేశ్ కుమార్, సుందరయ్య, బస్వరాజు, నర్సింలు పాల్గొన్నారు.

# పర్యాటక కొండ.. సంజీవరాయుడి గుట్ట

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రాంతం
- చాళుక్యులు నిర్మించిన ఖిల్లా, సొరంగ మార్గం, నీటి కొలను
- శ్రావణ మాసంలో పిక్నిక్ స్పాట్‌గా..
- వర్షాలు కురువాలని వరద పాయసంతో సందడి



వరద పాయసం కోసం ఎగబడుతున్న జనం

**హుస్నాబాద్:** శ్రావణ మాసం వచ్చిందంటే ఆహ్లాదకరమైన వాతావరణంలో వన భోజనాలు, పిక్నిక్ వెళ్లి సందడి చేస్తారు. ప్రకృతి సౌందర్యాలతో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే ప్రదేశాలను ఆస్వాదిస్తారు. అలాంటి ప్రకృతి, రమణీయంతో స్వాగతిస్తున్న సంజీవరాయుడి గుట్ట పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలోని సంజీవరాయుడి గుట్ట ప్రకృతి అందాలకు నిలయమైంది.

**నాలుగు వారాలు కిటకిట**

సంజీవరాయుడి గుట్ట దాదాపు 100 ఎకరాలకు పైగానే ఉంటుంది. గుట్ట పైకి నడిచి వెళ్లాలంటే తిరుపతి కొండలను ఎక్కినట్లుగా అనుభూతి పొందుతారు. గుట్ట చుట్టూ ప్రకృతి రమణీయమైన ఆకుపచ్చని పంట పొలాలు కనిపిస్తాయి. ఒక్కసారి వీక్షిస్తే మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుంది. గుట్టపై చాళుక్య రాజులు నిర్మించిన ఖిల్లా, నీటి కొలను, సొరంగ మార్గం, రేగొండ దర్వాజ, హనుమాన్ దేవాలయంతో పాటుగా కట్టడాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి.



గుట్ట కింది భాగంలో ప్రకృతి అందాలు

సంజీవరాయుడి గుట్ట, పెద్దగుట్ట మధ్య కల్కి చెరువు దృశ్యం మైమరిపిస్తుంది. గుట్ట కింది భాగంలో సమ్మక్క సారలమ్మ గద్దెలు నిర్మించారు. మూడేళ్లకోసారి వచ్చే సమ్మక్క సారలమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించారు. శ్రావణ మాసంలో నాలుగు వారాలు పర్యాటకులతో కిటకిట లాడుతుంది.

**గుట్టపై వరద పాయసం**

శ్రావణ మాసంలో ఇక్కడ జనమంతా వన భోజనాలకు వచ్చి సేద తీరుతారు. గుట్టపైనే వంటలు వండుకుంటారు. డప్పు చప్పుళ్లతో గుట్ట పైకి ఊరేగింపుగా వెళ్తారు. కొలనులో స్నానాలు ఆచరిస్తారు. అనంతరం హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేస్తారు. అనంతరం గుట్టపై బెల్లం పానకంతో తయారు చేసిన పాయసం వండుతారు. వర్షాలు కురువాలని బండ రాయిపై పోసిన వరద పాయసాన్ని స్వీకరించేందుకు జనం ఎగబడుతారు. వరుణ దేవున్ని కొలుస్తూ మహిళలు బతుకమ్మ ఆటలు ఆడుతూ రోజంతా గడుపుతారు. గుట్టపై ఉన్న కట్టడాలపై కూర్చొని ప్రకృతి అందాలను కనులారా వీక్షించి సంతోషం పొందుతారు.



నీటి కొలనులో స్నానం చేస్తున్న జనం



సొరంగం నుంచి బయటకు వస్తున్న మహిళ

### పచ్చని పొలాల్లోకి కెమికల్ వ్యర్థాలు



కుంటను తలపిస్తున్న వ్యర్థాలు

**శివ్వంపేట(నర్సాపూర్):** ఇష్టారాజ్యంగా కెమికల్ వ్యర్థాలను పరిశ్రమ నిర్వాహకులు బయటకు వదిలేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి బిజ్లీపూర్‌లోని ఓ కెమికల్ పరిశ్రమ నిర్వాహకులు వర్షాలను ఆసరాగా తీసుకొని అదే నీటిలో వ్యర్థాలను బయటకు వదిలేస్తున్నారు. ఆ వ్యర్థాలు పచ్చని పంట పొలాల్లోకి చేరుతుండడంతోపాటు భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. నిబంధనల ప్రకారం పరిశ్రమల్లోని కెమికల్ వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా కాలుష్య నియంత్రణ మండలి వ్యర్థాల కేంద్రానికి తరలించాల్సి ఉంటుంది. సంబంధిత పీసీబీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కెమికల్ పరిశ్రమ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయం గురించి పీసీబీ ఈఈ కుమార్ పాటీ వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.